# నేనూ–దొంగాడూ

మల్లిక్

**మా ఆఫీసులో** వచ్చే వారం డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఉంది. ఎకౌంటెన్సీ, జనరల్ ఇంగ్లీషు, అర్థమేటిక్‌లలో పరీక్ష పెడ్తారు. మొదటి రెండు పరీక్షల్లో పరవాలేదు గానీ, అర్థమేటిక్‌లోనే నేను చాలా పూర్.

"ఎలా, ఎలా?"

ఏం చెయ్యాలో తోచక బుర్ర గోడకేసి కొట్టుకున్నా.

హఠాత్తుగా ఎవరో నా కాలరు పట్టుకుని బర్రుమని వెనక్కి లాగేశారు.

వెనక్కి తిరిగి కోపంగా చూశాను.

మా ఇంటి యజమాని ఉన్నాడు.

"ఏవిఁటి?।।।ఏవిఁటది అంటున్నా?" చెవులు గండ్లు పడేలా అరిచాడు ఆయన.

"నా బుర్రకాయ్!...నా ఇష్టం!" అన్నాను ఉక్రోషంగా.

"బుర్రకాయ్ నీదే కానీ ఈ ఇల్లు నాది. నువ్విలా నీ తలతో గోడలు బద్దలుకొడ్తే ఊరుకునేదిలేదు. ఇంకోమారిలా చేస్తే ఇల్లు ఖాళీ చేయిస్తా..." అన్నాడు ముక్కు పొంగిస్తూ.

నా కోపం చప్పున చల్లారిపోయింది.

"క్షమించండి, సార్...నాకు వచ్చే వారం డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్స్ ఉన్నాయి. అందుకనీ...హిహిహి..." చేతులు నలుపుకుంటూ అన్నాను.

"పరీక్షలుంటే చక్కగా చదూకోవాలి గానీ నిక్షేపం లాంటి గోడలు బ్రద్దలు కొడ్తారటయ్యా ఆ!" కళ్ళెగరేశా డాయన.

"అబ్బే...మీ గోడలు బ్రద్దలుకొట్టే ఉద్దేశం నా కే కోశానా లేదండీ...మరేమోనండీ...నేనేమోనండీ...అర్థమేటిక్కులో చాలా పూరండీ ...ఏం చేయాలో తెలీక గోడకేసి తల కొట్టుకున్నానండీ... హిహిహి..." అన్నాను వినయంగా.

"నీ ఫ్రెండ్ చంచల్రావు మేథమాటిక్స్ స్టూడెంటే కదయ్యా" అన్నాడు.

"హుర్రే...ఈ విషయమే నాకు తట్టలేదే?" అని నాలుక కరుచుకుని అమాంతం మా ఇంటి యజమానిని కౌగిలించుకుని ముద్దు పెట్టుకున్నాను.

ఆయన చొక్కా పైకెత్తి ముఖంమీద కప్పుకుని సిగ్గుపడ్డాడు.

నేను చంచల్రావు ఇంటికి వెళ్ళి సంగతి చెప్పాను.

"ఓ...దాందేముంది" అన్నాడు.

"మీ ఇంట్లో జనం ఉంటారు...లాభం లేదు. నేను గదిలో ఒంటరిగా ఉంటాను కాబట్టి నువ్వు నా గదికి వచ్చి నాకు లెక్కలు చెప్పు...ఈ రాత్రికి నా గదిలోనే పడుకో" అన్నాను.

చంచల్రావు దానికీ సరే నన్నాడు. ఇద్దరం నా గదికి వెళ్ళాము.

నా గదిలో నేలమీద చాప పరుచుకుని ఇద్దరం దానిమీద కూర్చున్నాం. నేను అర్థమేటిక్ పుస్తకం, నోటుపుస్తకం తెచ్చి పెట్టాను.

"తలుపు ముందునుండి తాళం వేసి వస్తానుండు" అంటూ లేచాను.

"ఎందుకూ?" టి.వి.లో 'చిత్రహార్'లో మంచి పాట వచ్చినంత ఆశ్చర్యంగా చూశాడు చంచల్రావు నావైపు.

"ఎందుకేమిటి...వెధవ డిస్టబెన్స్...ముందునుండి తాళంవేసి నేను వెనక నుండి గదిలోకి వస్తాను. అప్పు డెవరైనా వస్తే తాళం చూసి నేను గదిలో లేననుకొని వెళ్ళిపోతారు" అన్నాను.

చంచల్రావు నా తెలివితేటలకి మూర్ఛపోయాడు.

నేను వాడి ముఖంమీద నీళ్ళు చల్లి-"మరేం బెంగ పెట్టుకోకు. నాకు అప్పుడప్పుడూ ఇలా మంచి అయిడియాలు తడ్తుంటాయ్" అని వాడికి నచ్చజెప్పి కూర్చోబెట్టి ముందువైపు నుండి తాళం వేసి వెనక తలుపు తేసుకుని గదిలోకి వచ్చాను.

ఇంకేం ఉందీ... చంచల్రావు మళ్ళీ మూర్ఛపోయి ఉన్నాడు.

మళ్ళీ వాడి ముఖాన నీళ్ళు చల్లి లేపి కూర్చోబెట్టాను.

"నీ కిందాకే చెప్పానా నా కప్పుడప్పుడూ బ్రిలియంట్ అయిడియాలు వస్తాయని...నువ్విలా మాటి మాటికీ మూర్ఛపోతే నాకు లెక్కలు చెప్పే దెప్పుడు" అంటూ వాడిమీద కోపగించుకున్నాను.

"ఓకే...ఓకే...ఇంక మూర్ఛపోనుగా" అన్నాడు పిచ్చాడిలా నా వంక చూస్తూ.

ఇద్దరం చాపమీద కూర్చుని పుస్తకాలు తెరిచాము.

'కాలము—పని' లెక్కలు రెండు చేసి చూపించాడు చంచల్రావు.

"ఇంక ఈ ఎక్సర్‌సైజు మొత్తం నువ్వు చెయ్యి" అన్నాడు.

నేను 'అలాగే' అని అనబోయి కళ్ళు తేలేశాను.

"ఏం?...ఇంకా అర్థం కాలేదా? మరో లెక్క చేసి చూపించనా?" అని అడిగాడు చంచల్రావు.

నేను వాడికి సైగచేసి గుమ్మంవైపు చూపించాను.

చంచల్రావు అటువైపు చూసి వాడుకూడా కళ్ళు తేలేశాడు.

గుమ్మంలో ఎవడో నిలబడి ఉన్నాడు.

పొట్టిగా కత్తిరించిన జుట్టు- నల్లగా, సన్నగా ఉన్నాడు.

"వార్నీ యవ్వ...ముంగట్ కెల్లి నూసి తాళమేనుంటే ఎవ్వ ళ్ళుండరని ఎనక కెల్లి వచ్చా...మీర్ కమ్రలోనే ఉన్నార్ వయ్య?" అన్నాడు వాడు మమ్మల్ని ఆశ్చర్యంగా చూస్తూ.

కాస్సేపు మా ఇద్దరికీ నోట మాట రాలేదు.

వాడు రెండడుగులు మావైపు వేశాడు.

ఇద్దరం గబుక్కున లేచి నిలబడ్డాం.

"ఎవడ్రా నువ్వు?" అన్నాడు చంచల్రావు ధైర్యం చేసి.

"నా పేరు రాంలు" అన్నాడు వాడు చిత్రంగా చూస్తూ.

అడగ్గానే జవాబిచ్చినందుకు నాకూ ధైర్యం వచ్చింది.

"ఎందుకు వచ్చావ్?" అని అడిగాను.

"దొంగతనానికి..." అన్నాడు వాడు ఏమాత్రం తొణక్కుండా.

"రా స్కేల్...ఏవిఁట్రా కూస్తున్నావ్?" అంటూ చంచల్రావు వాడివైపు రెండడుగులు వేశాడు.

హఠాత్తుగా వాడి చేతిలోని కత్తి ప్రత్యక్షమైంది.

నేను కెవ్వున కేకేశాను. చంచల్రావు కంగారు పడిపోయాడు.

"హాహాహా...ఈ రాంలు అంటే ఏందో సమజైందా మల్ల:..నూసినావ్ బే...నీ దోస్త కత్తి చూసి గెట్ల పరేషాన్ అవుతుండో" అన్నాడు రాంలు నాతో.

"చప్...నిన్ను చూ*సి నేను కంగారు పడడం ఏమిటి? మాబాడు పెట్టిన కేకకి కంగారుపడ్డానుగానీ..." వాడివైపు మరో రెండడుగులు వేశాడు చంచ్రలావు.

రాంలు కత్తి పట్టుకున్న చెయ్యి పైకి లేపాడు.

"కరీబొచ్చినా వంటే పాడి సేస్తా...ఖబడ్డార్" అన్నాడు.

"ఒరేయ్! వద్దురా, చెంచిగా..." అన్నాను నేను అరుస్తూ.

చంచ్రలావు నవ్వి మరో అడుగు ముందుకేశాడు.

"ఏమోయ్...నీకు దొంగతనం చెయ్యడం ఇదే మొదలా?"

రాంలు కంగారు పడిపోయాడు.


"నేనా?...కొత్తా? ఎవల్జెప్పిన్రు... *సెన్నప్పటి



నంది నే నిండ్లనే ఉన్నా. మర్డర్లూ, రేపులూభీ చే*సినా...అగ్గో మల్ల...కరీబ్ రాకు...పాడి సేస్తా" అంటూ కత్తి ఉన్న చెయ్యి మరీ పైకి లేపాడు.

"కత్తి పట్టుకోవడమే రాదు. నువ్వెక్కడి దొంగవయ్యా?" అంటూ నవ్వాడు చంచ్రలావు.

రాంలు కంగారు పడిపోతూ కత్తివంక చూసుకున్నాడు. అంతవరకూ కంగారులో నేనూ గమనించలేదు. రాంలు కత్తికి పదును ఉండే వైపు పట్టుకుని పిడి మా వైపు ఉండేలా పెట్టాడు.




తను కత్తిని ఎలా పట్టుకున్నాడో చూసుకున్న రాంలు మరింత కంగారు పడిపోయి కత్తిని మరీ మూలుగా పట్టుకోబోయాడు. కానీ, చంచల్రావు మెరుపులా వాడిమీదికి దూకి, వాడిని గట్టిగా వాటేసుకున్నాడు. పెనుగులాటలో రాంలు చేతిలోని కత్తి జారి క్రింద పడిపోయింది.

నేను కూడా ధైర్యం చేసి ముందుకు దూకి రాంలును గట్టిగా పట్టుకుని "దొంగ...దొంగ" అని అరిచాను.

నా అరుపులకి గది బయట జనం మూగారు.

"అందర్ కైసా ఆనా...బయట గుఫల్ ఉందే..." అన్నాడు పక్కింటి రవూఫ్. "లోపలెట్లుండి(నయ మీరు" అని కేకేశాడు అదే వీధిలో ఉండే షావుకారు యాదగిరి.

"వెనకవైపు నుండి తలుపు తెరిచుంది." నేను మరీ గట్టిగా అరిచాను.

గదిలోకి బిలబిల మంటూ జనం వచ్చేశారు.

"తన్నండి వెధవని...మరీ ఇంత పెందలాడే దొంగతనమా?" ఎవరో అన్నారు.

"రేపట్నుంది అర్ధ రాత్రే వస్తాను...నన్ను వదులు(ని" అన్నాడు రాంలు, అందర్నీ బిక్కు బిక్కుమని చూస్తూ.

"దొంగతనం చేస్తావు బే?"

పది చేతులు పిడికిళ్ళు బిగించి గాల్లో లేచాయి.

"ఆగండి." అరిచాడు చంచల్రావు.

వాళ్ళు ఆగారు.

"వీడిని మనం ఎందుకు తన్నడం..."

"అయితే పోలీసులకి అప్పజెప్పుదాం." ఎవరో అన్నారు.

చంచల్రావు రాంలువైపు చూశాడు. భయంతో వాడు బిక్కచచ్చిపోయాడు.

"ఉహుం...వీడిని మనం తన్నేం అనుకో ...బండబారిపోతాడు. పోలీసులకి అప్పజెప్పితే వాళ్ళు తన్నే తన్నులకీ, జైలు జీవితంవల్ల మరీ బండబారిపోతాడు. వీ డనలే కొత్తగా ఈ వృత్తి మొదలుపెట్టిన ట్టున్నాడు. వీడి మనసుకు శిక్ష విధించాలి. వీడిలో మానసికంగా మార్పు రావాలి. అప్పుడే వీడు మళ్ళీ దొంగతనం చెయ్యడు...కానీ అందుకు మన మేం చెయ్యాలో ఆలోచించాలి..."

చంచల్రావు ఆలోచిస్తూ బుర్ర గోక్కున్నాడు.

గుంపులోంచి మరో నలుగురు అతనిమీద పడి, అతని బుర్రని బరబరా గోకడం మొదలుపెట్టారు.

"ఏంటయ్యా ఇది?" వాళ్ళని కసురుకున్నాడు చంచల్రావు.

"మీకు త్వరగా అయిడియా తట్టాలని..." అన్నారు వాళ్ళు ఏక కంఠంతో.

నేను కెవ్వున అరిచాను.

అందరూ కంగారుపడి నన్ను పట్టుకున్నారు.

"ఏమైంది, ఏమైంది?"

"నాకు బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది."

"ఏమి టది?" చంచల్రావు ముందుకొచ్చి అడిగాడు.

"దగ్గరకు రా."

చంచల్రావు చెవిలో చెప్పాను.

చంచల్రావు విరుచుకు పడిపోయాడు.

"ఏమైంది, ఏమైంది?"

అందరూ చంచల్రావు చుట్టూ గుమిగూడారు.

"ఏం లేదు...ఈ వేళ నాకు అయిడియాలు తట్టున్నాయని ఆశ్చర్యంతో మూర్ఛపోతున్నాడు" అన్నాను.

వాడి ముఖంమీద నీళ్ళు చల్లి లేపాము.

లేస్తూనే సంతోషంగా నన్ను కౌగిలించుకున్నాడు చంచల్రావు. "ఒరేయ్, బుచ్చిబాబూ!...ఈవేళ నీ కే మైందిరా?"

"అయితే నా ఆలోచన నీకు నచ్చిందా?"

"బ్రహ్మాండం..." అన్నాడు.

రాంలు బిక్కుబిక్కు మంటూ మావైపు చూశాడు.

"ఏంటి, ఏం టది?" అన్నారు జనం.

"మీరే చూస్తారుగా" అన్నాడు చంచల్రావు నవ్వుతూ.

"అలాగయితే వీళ్ళ నెవర్నైనా అడుగుదామా?" అన్నాను.

"వద్దులే...ఎవర్నో ఎందుకు? మాఇంట్లోదే తీసుకువద్దాం" అన్నాడు చంచల్రావు.

జనాన్ని వాడికి కాపలా పెట్టి ఆటోలో చంచల్రావు ఇంటికి వెళ్ళి మూక్కావల సింది ఓ అట్టపెట్టెలో సర్ది, అదే ఆటోలో నా గదికి వచ్చేశాం.

జనం ఆత్రతగా మాకంక చూస్తున్నారు.

అట్టపెట్టె విప్పి వైర్లూ దాన్నీ బయటకు తీశాం.

దాన్ని చూస్తూనే జనం హాహాకారాలు చేశారు.

"భలే, భలే... మంచి పని చేశారు..." అన్నాడు అనుభవజ్ఞుడైన ఒక వృద్ధుడు.

రాంలు దానివంక, ఒకసారి జనం అందరి వంక విచిత్రంగా చూశాడు. వాడి కేమీ అర్థం కాలేదు.

"దీన్ని ను వ్వెప్పుడైనా చూశావా?" చంచల్రావు రాంలుని అడిగాడు.

వాడు అమాయకంగా తల అడ్డంగా ఊపాడు.

"ఇప్పుడు రుచి చూద్దువుగాని..."

"దెబ్బకి దొంగతనం మానేయాలి." జనంలోంచి ఎవరో కోపంగా అన్నారు.

రాంలుని కుర్చీకేసి కట్టేసి టకటకా వైర్లన్నీ అమర్చేశాము.

అప్పుడు సరిగ్గా రాత్రి ఏడు గంటలైంది.

"రెడీ...వన్...టూ...త్రీ..." అన్నాడు చంచల్రావు.

నేను స్విచ్ ఆన్ చేశాను.

క్షణాలమీద రాంలు ముఖంలో మార్పు వచ్చింది. అందరూ ఆత్రతగా అతన్ని పరిశీలించ సాగారు.

కెవ్వున అరిచాడు రాంలు. వాడి ముఖం అంతా చెమట క్రమ్మేసింది. నిలువెల్లా వణికిపోసాగాడు.

మిగతా వా ళ్ళందరు అటు చూడలేక తమలో తాము గుసగుసగా మాట్లాడుకొంటూ, ఛలోక్తులు వేసుకొంటూ నిలుచున్నారు.

అయిదు నిముషాలు గడిచాయి.

రాంలు హఠాత్తుగా ఏడవడం మొదలుపెట్టాడు.

"స న్నిడిసి పెట్రూండి, దొరా...ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యను..." అన్నాడు. వాడి కళ్ళమ్మట ధారగా నీళ్ళు కారుతున్నాయి.

నేను చంచల్రావువంక చూశాను.

"ఉహుం...అంత త్వరగా లాభం లేదు...ఇంకా మనసుని మథించాలి. దొంగతనానికి వచ్చినందుకు పశ్చాత్తాపం కలగాలి"

అన్నాడు వాడు.

మరో పావుగంట గడిచింది.

రాంలు మందు తిన్న ఎలకలా గిలగిల తన్నుకోసాగాడు.

ఆ దృశ్యం చూడలేక కొందరు గది బయటికి వెళ్ళిపోయారు.

ఒక్కసారి హృదయ విదారకంగా అరిచి మూర్ఛపోయాడు రాంలు. నేను స్విచ్ ఆఫ్ చేశాను.

"ఇంక చాలు..." అన్నారు జనం.

"అప్పుడేనా?" అన్నాడు చంచల్రావు.

ఒక మనిషిని ఇంతగా హింసించడం మేం సహించం" అన్నాడో మానవతావాది.

"మేము వాడికి మేలు చేయాలనే ఇలా చేస్తున్నాం. వాడిచేత దొంగతనం మాన్పించి, వాడిని మంచి మార్గంలో పెట్టాలని మా ఆలోచన. అంతేగానీ వాడిమీద మాకేమీ ద్వేషం గానీ, పగ గానీ లేదు" అన్నాడు చంచల్రావు.

"వీల్లేదు...వాడిని వదిలెయ్యాల్సిందే..."

రాంలు కళ్ళు మూసుకొన్నాడు. చంచల్రావు వాడిని హడలగొట్టి కళ్ళు తెరిపించాడు.

మాకూ, జనానికీ పావుగంట పాటు వాదన జరిగిన తరువాత జనం మాదారికి వచ్చారు.

రాంలు ముఖంమీద నీళ్ళు జల్లి లేపాము.

నేను స్విచ్ ఆన్ చేశాను.

రాంలు పెడబొబ్బలు పెడ్తూ ఏడవసాగాడు. గజగజ వణికిపోసాగాడు.

మరో అరగంట గడిచింది.

భళ్ళున వాంతి చేసుకున్నాడు రాంలు.

నేను స్విచ్ ఆఫ్ చేసి, మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాను. రాంలు ఒక్క గుటకలో నీళ్ళన్నీ త్రాగేశాడు.

"మీ కాల్మొక్తా...నన్నొదులు, దొరా" అన్నాడు జాలిగా.

వాడు పడే బాధకు ఒక ప్రక్క కన్నీళ్ళు కారుస్తూనే, నేను మళ్ళీ స్విచ్ ఆన్ చేశాను.

మా అందరికీ తెలుసు అది పోలీసులు ఉపయోగించే థర్డ్ డిగ్రీ మెథడ్ కంటే ఘోరమైనదని.

కానీ ఒక దొంగని మార్చాలంటే అంతకన్నా తప్పదు.

గదిలోని వాళ్ళందరూ కన్నీళ్ళు తుడుచుకోసాగారు, రాంలు అనుభవిస్తున్న నరక యాతనని చూస్తూ.

నిముషాలు గడుస్తున్నాయి.

రాంలు ముఖం పూర్తిగా పాలిపోయింది.

చంచల్రావు రాంలు నొసలుమీద చెయి వేసి చూశాడు.

"ఓహ్...జ్వరం వచ్చేసింది...ఒళ్ళు కాలిపోతూంది" అన్నాడు.

అప్పుడు సరిగ్గా తొమ్మిది గంటలైంది.

నేను స్విచ్ ఆఫ్ చేశాను.

రాంలు కట్లు విప్పేశాము. వాడు మా కాళ్ళమీద పడి భోరున ఏడ్చాడు.

వాడిని లేవనెత్తాము.

"ఇంకెప్పుడైనా దొంగతనం చేస్తావా?" అని అడిగాను నేను.

"లేదు, దొరా...బుద్ధొచ్చింది..." అంటూ చెంప లేసుకున్నాడు.

రాంలుని వదిలేశాము. వాడు అందరికీ నమస్కారం పెట్టి నీరసంగా గదిలోంచి వెళ్ళిపోయాడు.

ఇంతకీ రాంలుకి మేం ఇచ్చిన ట్రీట్‌మెంటు ఏమిటని ఆలోచిస్తున్నారా? చంచల్రావు ఇంటినుండి మేము తెచ్చింది మరేవీటో కాదు. ఓ టి. వి. సెట్టు తెచ్చాం. రాంలుని కుర్చీకి కట్టేసి ఏడు గంటలనుండి తొమ్మిది దాకా వచ్చే కార్యక్రమాలన్నీ చూపించాం. చెవిలో మైక్రో స్పీకర్లు పెట్టాం. ఆ దెబ్బకి మారాడు వాడు.

మాకు టి. వి. అలవాటు అయింది కాబట్టి అంత బాధ అనుభవించలేదు. వాడు ఎప్పుడూ చూడని కారణంగా హఠాత్తుగా రెండు గంటల సేపు ఆ బాధ భరించలేక గిలగిలలాడాడు.

ఒక వారం తరువాత రోడ్డుమీద కూరగాయల బండి తోసుకువస్తూ ఎదురయ్యాడు రాంలు.

"మీ దయవల్ల గిప్పుడు కూరగాయల దందా జేస్తూ షరాఫత్‌గా బత్కుతున్నా, సాబ్" అన్నాడు రెండు చేతులు జోడిస్తూ.

నేను తృప్తిగా నవ్వుకున్నాను. ◆


## నవభారత్ '84

మీ సత్సాహిత్యాభిలాషాస్వాదనకి

## యండమూరి వీరేంద్రనాథ్ సమర్పించు

నవరస నవలా సరిగమలు



పాతపుస్తకాలు సర్దుతూవుండగా ఓ ప్రేమలేఖ జారిందనుకోండి. అబ్బెబ్బె.... అది మీ శ్రీవారుగాని/ శ్రీమతిగాని వ్రాసింది కాదు.... పాపం ఎవరో ఎవరికో ఎన్నాళ్ళక్రిందో వ్రాసుకుంది. అందులో ఒక పాయింట్ "పాపం ఆ అభాగ్య ప్రేమికులకు ఆ విషయం తెలియజెప్పాలి. లేకపోతే కొంపలు మునిగిపోతాయని"..... అంతేకాదండోయ్! తెలివైన స్త్రీ-భర్తకంట్రోల్‌లో వుంటూ భర్తని ఎలా కంట్రోల్ చేయవచ్చో కూడా చెబుతున్న... తెలుగుకథాసాహిత్యంలో మరో కొత్త ప్రయోగం.



స్త్రీ పురుషుల మధ్య ప్రేమ ఔన్నత్యాన్ని ఫ్యూచరాలజీతో మిళితం చేసి-పద్నాలుగేళ్ళ కుర్రవాణ్ని పాతికేళ్ళ అమ్మాయి ప్రోత్సహించిన వైనం. ఆ ఆసరాతో దేశపు సంస్కృతినే తారుమారు చేసిన ఓ యువకుని గాథ! మానవత్వపు పొరల అడుగునుంచి తీసిన ప్రేమా ఆప్యాయతల మధుర మకరంద రసానుబంధం! తెలుగు నవలా సాహిత్యంలో కలకాలం-గుర్తుండే అందమైన మలుపు.

**క్షమించు సుప్రియా!** రూ.12/- **ఆనందోబ్రహ్మ** రూ. 20/-

నవభారత్ బుక్ హౌస్. కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ-2

(అన్ని బుక్ స్టాల్స్‌లోను లభించును. అడ్వాన్స్ పంపిన VPP లో పంపబడును)